ఉత్తరం కాకతీయ
TG TEL/25/A1234
www.kakatiyanews.com
ఆదివారం, 20 సెప్టెంబర్ 2026 | సంపుటి: 02 సంచిక: 34 | పేజీలు: 4 వెల: 5



మామునూరులో ప్రపంచస్థాయి

# విమానాశ్రయ

**ఎయిర్‌పోర్టుతో వరంగల్‌కు కొత్త గుర్తింపు**

- రూ.295 కోట్లతో భూసేకరణ.. ఏఏఐకి భూమి అప్పగింత
- పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలకు కొత్త గేట్‌వే
- కీలక ప్రక్రియంతా పూర్తయినట్లే : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

3

2047 నాటికి అభివృద్ధి చెందిన

## భారత్ లక్ష్యం

- యువతకు ఎఫ్‌టీఏలతో కొత్త కెరీర్ అవకాశాలు
- ప్రపంచ మార్కెట్లలో భారత ప్రతిభకు పెరుగుతున్న గుర్తింపు
- బ్రిక్స్‌లో యువత భాగస్వామ్యం పెరగాలి
- 'నాగరిక్ దేవో భవ' స్ఫూర్తితో సేవ చేయాలి : ప్రధాని నరేంద్ర మోదీ



3

బోగస్ అడ్మిషన్లపై

## అధికారుల ఆరా

- బోగస్ అడ్మిషన్లతో ప్రభుత్వ నిధుల మళ్లింపు?
- స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విజిలెన్స్ సోదాలు
- పలు ప్రాంతాల్లో ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో తనిఖీలు

3



# నాడు ఈటల.. నేడు కేసీఆర్!

## నాటి భూవివాదం.. నేటి ఎర్రవల్లి ఎపిసోడ్

**700 ఎకరాలపై రేవంత్ సర్కార్ ఫోకస్**

- అప్పుడు ఈటలపై విచారణ.. ఇప్పుడు కేసీఆర్ భూములపై సర్వే
- 388 ఎకరాల ప్రభుత్వ భూమిపై అసలు లెక్కేంటి?
- రాజకీయ అస్త్రమా.. రికార్డుల పరిశీలనా?
- నివేదిక ఏం చెబుతుందోనన్న ఉత్కంఠ

**కాకతీయ, తెలంగాణ బ్యూరో:** తెలంగాణ రాజకీయాల్లో భూమి వ్యవహారం మరోసారి కేంద్ర బిందువైంది. నాడు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం అప్పటి మంత్రి ఈటల రాజేందర్ కుటుంబానికి చెందిన జమునా హ్యాచరీస్ భూములపై విచారణ జరిపించింది. నేడు అధికారంలో ఉన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసర భూములపై సర్వేకు దిగింది. దీంతో నాటి ఈటల ఎపిసోడ్.. నేటి ఎర్రవల్లి వ్యవహారం మధ్య రాజకీయ పోలికలు తెరపైకి వచ్చాయి. 2021లో ఈటల రాజేందర్ కుటుంబానికి చెందిన జమునా హ్యాచరీస్ భూములపై ఫిర్యాదులు రావడంతో మెదక్ జిల్లా యంత్రాంగం విచారణ చేపట్టింది. అప్పటి కలెక్టర్ ప్రాథమిక నివేదికలో 66.01 ఎకరాల అసైన్డ్ భూమి జమునా హ్యాచరీస్ ఆధీనంలో ఉన్నట్లు పేర్కొంది. అనంతరం ఈటలను కేసీఆర్ మంత్రివర్గం నుంచి తొలగించారు. ఈటల మాత్రం తనపై రాజకీయ

........(తరువాయి 3లో)

# కడియం.. రెడీగా ఉండు!

- దానం నాగేందర్‌లాగే నీపైనా అనర్హత వేటు తప్పదు
- ఫిరాయింపులపై హైకోర్టు తీర్పు కీలక మలుపు
- స్పీకర్ నిర్ణయంపైనా న్యాయస్థానాల జోక్యం
- సుప్రీంకోర్టు నిబంధనలు పాటించాల్సిందే
- దానం నాగేందర్ తొలి వికెట్.. ఇక కడియమే
- మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య హెచ్చరిక



**కాకతీయ, హన్మకొండ :** కడియం శ్రీహరి.. రెడీగా ఉండు.. దానం నాగేందర్‌కు వచ్చిన తీర్పే నీ విషయంలోనూ వస్తుంది అంటూ మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య హెచ్చరించారు. బీఆర్ఎస్ తరఫున ప్రజల తీర్పుతో గెలిచిన ఎమ్మెల్యేలు మరో పార్టీలో చేరడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. దానం నాగేందర్ అనర్హతపై హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావిస్తూ, ఫిరాయింపుల వ్యవహారంలో ఇది తొలి వికెట్ మాత్రమేనని, మిగతా కేసుల్లోనూ న్యాయపరమైన పరిణామాలు తప్పవని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన కడియం శ్రీహరి విషయంలోనూ ఇదే తరహా పరిస్థితి ఎదురవుతుందని రాజయ్య పేర్కొన్నారు. శనివారం ఓ మీడియాతో మాట్లాడుతూ రాజయ్య ఈవ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ అభ్యర్థులుగా గెలిచిన ఎమ్మెల్యేలు అనంతరం కాంగ్రెస్‌లో చేరడాన్ని ప్రశ్నించారు. ఒక పార్టీ అభ్యర్థిగా గెలిచి మరో పార్టీలో చేరడం ప్రజల తీర్పును అవమానించడమేనని అన్నారు. పార్టీ ఫిరాయింపుల అంశాన్ని న్యాయపరంగానూ, రాజకీయంగానూ ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

**దానం నాగేందర్ తొలి వికెట్**

దానం నాగేందర్ విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పును రాజయ్య కీలక పరిణామంగా పేర్కొన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హతపై స్పీకర్ తీసుకున్న నిర్ణయాలను న్యాయస్థానాలు పరిశీలించే పరిస్థితి ఏర్పడిందని అన్నారు. దానం నాగేందర్‌ను తొలి

........(తరువాయి 2లో)

# వనమా ఇంట్లో వారసత్వ వార్!



- కూతురి కోసం రాఘవ పట్టు.. మనవడి కోసం తాత ఆలోచన
- రాజకీయ వారసత్వంపై తండ్రీకొడుకుల మధ్య విభేదాలు
- అలేఖ్యను రాజకీయాల్లోకి తేవాలని రాఘవ ఒత్తిడి
- సాయినాథ్‌ను రంగంలోకి దించాలని మాజీ ఎమ్మెల్యే వనమా యోచన
- సస్పెన్షన్ తొలగక రాఘవలో అసంతృప్తి
- వద్దిరాజు మన అభ్యర్థి అంటూ మాజీ ఎమ్మెల్యే వ్యాఖ్యలతో ముదిరిన వ్యవహారం

**కాకతీయ,తెలంగాణ బ్యూరో :** కొత్తగూడెం మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు కుటుంబంలో రాజకీయ వారసత్వ వ్యవహారం చిచ్చు రేపుతున్నట్లు బీఆర్ఎస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తన కూతురు అలేఖ్యను రాజకీయ వారసురాలిగా రంగంలోకి దించాలని వనమా రాఘవ పట్టుబడుతుండగా, తన రెండో కొడుకు రామకృష్ణ కుమారుడైన సాయినాథ్‌ను రాజకీయాల్లోకి తీసుకురావాలని వనమా వెంకటేశ్వరరావు ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇంట్లో రాజకీయంగా తన మాటే చెల్లుబాటు కావాలన్న రాఘవ వైఖరికి, మనవడిపై మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు ఉన్న మమకారానికి మధ్య విభేదాలు పెరిగినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ నుంచి రాఘవ సస్పెన్షన్‌కు గురికావడం, అది తొలగకపోవడంతో ఆయన రాజకీయ భవిష్యత్‌పై

........(తరువాయి 2లో)

# దానం లెక్కేంటి?

## వేటు పడినా వెనక్కి తగ్గని నేత

**సుప్రీంకు వెళ్లకుండా ఉపపోరుకే రెడీ**



- కాంగ్రెస్ బీఫామ్ కోసం హైకమాండ్‌పై ఆశలు
- ఖైరతాబాద్‌లో సొంత బలాన్ని చాటుకునే వ్యూహం
- ఫిరాయింపు ముద్రకు ప్రజాతీర్పుతో సమాధానం
- ఓటమిని విజయంగా మార్చుకునే రాజకీయ ఎత్తుగడ

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** అనర్హత వేటు.. ఎమ్మెల్యే పదవి కోల్పోవడం.. ఖైరతాబాద్ ఉపఎన్నికకు తెరతీసిన తాజా పరిణామాలు.. ఇవేవీ దానం నాగేందర్‌ను వెనక్కి తగ్గించలేకపోయాయి. సుప్రీంకోర్టును ఆశ్రయించడం కంటే ప్రజాక్షేత్రంలోనే తేల్చుకోవాలన్నదే ఆయన లెక్కగా కనిపిస్తోంది. హైకోర్టు తీర్పు అనంతరం ఉపఎన్నిక ఎప్పుడు వచ్చినా పోటీకి సిద్ధమని దానం ప్రకటించడం ద్వారా తన తదుపరి రాజకీయ అడుగుపై స్పష్టత ఇచ్చారు. ఇప్పుడు ఆయన ముందున్న అసలు టార్గెట్ ఖైరతాబాద్ బీఫామ్. కాంగ్రెస్ అధిష్ఠానం తనకే మరోసారి అవకాశం ఇస్తుందన్న ఆశతోనే ఆయన ముందుగానే ఎన్నికల సమరానికి సిద్ధమవుతున్న సంకేతాలు ఇస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన దానం నాగేందర్‌పై ఫిరాయింపుల వ్యవహారంలో అనర్హత వేటు పడింది. దీంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయ్యే పరిస్థితి ఏర్పడింది. అయితే ఈ పరిణామాన్ని దానం రాజకీయ ముగింపుగా చూడటం లేదు. ఎన్నికలు వస్తే మళ్లీ పోటీ చేస్తానని చెప్పడం ద్వారా తన రాజకీయ భవిష్యత్తును ప్రజల చేతుల్లోనే పెట్టాలనే వైఖరిని ప్రదర్శించారు. ఇక్కడే కాంగ్రెస్ టికెట్ కీలకంగా మారింది. ఉపఎన్నికకు పార్టీ సిద్ధంగా ఉందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ప్రకటించినప్పటికీ అభ్యర్థిపై తుది నిర్ణయం హైకమాండ్‌దే. దానం నాగేందర్‌కే బీఫామ్ ఇస్తారా? కొత్త అభ్యర్థిని రంగంలోకి దింపుతారా? అన్నది తేలాల్సి ఉంది. టికెట్ కోసం పార్టీ పెద్దలతో తన రాజకీయ సంబంధాలను ఉపయోగించుకోవడం దానం ముందున్న ముఖ్యమైన రాజకీయ కార్యాచరణగా మారనుంది.

**'ఫిరాయింపు' ముద్రకు ప్రజాతీర్పే సమాధానం**

బీఆర్ఎస్ టికెట్‌పై గెలిచి కాంగ్రెస్‌లో చేరడం.. అనంతరం

........(తరువాయి 2లో)

# 10ఏళ్లలో వేల కోట్లు ఎట్లా సంపాదించారు

- వచ్చిన తెలంగాణ కేసీఆర్ కుటుంబానికే ఉపయోగపడింది
- 2014లో ఒక్క ఎకరం లేదన్న వారికిప్పుడు వందల ఎకరాలు?
- ఆస్తుల వివరాలు చెప్పకుండా ఎదురుదాడి ఏం వైఖరి?
- దేవాదుల నీటితో స్టేషన్‌ఘన్‌పూర్ రైతులకు సాగునీరు
- అవినీతి, అక్రమాలకు తావులేకుండా పథకాల అమలు
- మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి



కాకతీయ, ధర్మసాగర్ : 2014లో ఒక్క ఎకరం కూడా లేదని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్న కల్వకుంట్ల కుటుంబానికి 2026 నాటికి వందల ఎకరాలు, వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో ప్రజలకు చెప్పాలని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. 2014కు ముందు కేసీఆర్ కుటుంబం ఆస్తుల విలువ ఎంత, ఇప్పుడు ఉన్న

........(తరువాయి 2లో)





జమ్మికుంట మున్సిపాలిటీలో

# ఆడియో కలకలం

**కౌన్సిలర్ వర్సెస్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వివాదం**

- డీజిల్ బకాయిలు.. జేసీబీ పనులపై ఆరా
- వైరల్ ఆడియోలో లక్షల రూపాయల వ్యవహారం ప్రస్తావన
- జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు

4

# 10ఏళ్లలో వేల కోట్లు ఎట్లా సంపాదించారు

(మొదటిపేజీ తరువాయి)
ఆస్తుల విలువ ఎంత అన్నది వెల్లడించాలని ప్రశ్నించారు. తెలంగాణ పేరు చెప్పుకుని అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ తెలంగాణ వనరులను దోచుకుని వేల కోట్ల ఆస్తులు సంపాదించుకుందని విమర్శించారు. ఆస్తులు ఎలా వచ్చాయో చెప్పకుండా ఎదురుదాడికి దిగుతున్నారని అన్నారు. తెలంగాణ ఉద్యమకారులకు ఒక్క ఎకరం భూమి ఇచ్చారా, ఒక్క ఉద్యోగం ఇచ్చారా అని ప్రశ్నించారు. ధర్మసాగర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ మండలానికి చెందిన 36 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.36,04,176 విలువైన చెక్కులను, 33 మంది ముఖ్యమంత్రి సహాయనిధి లబ్ధిదారులకు రూ.17,11,500 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన నిరుపేదలకు చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు పనిచేయాలని సూచించారు.



**కరువులోనూ స్టేషన్‌ఘన్‌పూర్‌కు సాగునీరు**
రాష్ట్రవ్యాప్తంగా కరువు పరిస్థితులు ఉన్నప్పటికీ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో సాగునీటి ఇబ్బందులు లేకపోవడానికి దేవాదుల ప్రాజెక్టే కారణమని కడియం శ్రీహరి అన్నారు. దేవాదుల ద్వారా రిజర్వాయర్లను నింపుకుని పంటలకు సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. 20 ఏళ్ల క్రితం చిన్న మొక్కగా ప్రారంభమైన దేవాదుల ఎత్తిపోతల పథకం నేడు మహావృక్షంగా ఎదిగి ఉమ్మడి వరంగల్ జిల్లాకు సాగునీరు, తాగునీరు అందిస్తోందన్నారు. తన రాజకీయ జీవితంలో అత్యంత సంతృప్తినిచ్చిన పని దేవాదుల ప్రాజెక్టేనని పేర్కొన్నారు. ఈ ఖరీఫ్‌లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు.

**కల్యాణలక్ష్మితో పేద కుటుంబాలకు భరోసా**
కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడపిల్లల తల్లిదండ్రులకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని కడియం శ్రీహరి అన్నారు. ఆడపిల్ల వివాహం చేయాలంటే తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని, ప్రభుత్వం అందించే రూ.1,00,116 ఆర్థికంగా కొంత వెసులుబాటు కల్పిస్తోందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 2 ఏళ్లలో రైతులు, మహిళలు, పేద వర్గాల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టి పలు పథకాలు అమలు చేస్తోందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి ద్వారా ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతోపాటు మహిళా సంఘాలకు వడ్డీలేని, పావలా వడ్డీ రుణాలు, వ్యాపార, పారిశ్రామిక ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు వివరించారు.

**ప్రభుత్వంపై అప్పుల భారం ఉన్నా సంక్షేమానికి పెద్దపీట**
రాష్ట్ర ప్రభుత్వంపై రూ.8.11 లక్షల కోట్ల అప్పుల భారం ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పేద వర్గాల సంక్షేమానికి, సంక్షేమ పథకాల అమలుకు పెద్దపీట వేస్తున్నారని కడియం శ్రీహరి తెలిపారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులు వివాహం జరిగిన వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న 3 నెలల్లో ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, ముఖ్యమంత్రి సహాయనిధి, ఇతర ప్రభుత్వ పథకాల కోసం ఎవరూ ఒక్క రూపాయి కూడా ఎవరికీ ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ పథకాలు నేరుగా అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు నిజాయితీగా పనిచేయాలని సూచించారు.

**10 ఏళ్ల ఆస్తుల లెక్క చెప్పాలి**
కల్వకుంట్ల కుటుంబానికి 2014కు ముందు ఉన్న ఆస్తులు, 2026 నాటికి ఉన్న ఆస్తుల వివరాలను ప్రజల ముందుంచాలని కడియం శ్రీహరి డిమాండ్ చేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో 2014లో ఒక్క ఎకరం కూడా లేదని పేర్కొన్న వారు ఇప్పుడు వందల ఎకరాలు ఎలా సంపాదించారో వివరించాలని ప్రశ్నించారు. 10 ఏళ్లలో వేల కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో చెప్పకుండా తమపై ఎదురుదాడి చేయడం సరికాదన్నారు. తెలంగాణ వనరుల వినియోగం, గత ప్రభుత్వ పాలన, కుటుంబ ఆస్తుల పెరుగుదలపై ప్రజలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత బీఆర్ఎస్ నాయకత్వంపై ఉందని అన్నారు.

**పథకాలకు ఒక్క రూపాయి ఇవ్వొద్దు**
ప్రభుత్వ పథకాల కోసం లబ్ధిదారులు ఎవరూ ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన అవసరం లేదని కడియం శ్రీహరి స్పష్టం చేశారు. మీకు రావాల్సిన ప్రభుత్వ పథకాలు మీ ఇంటికే వస్తాయని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు నిజాయితీగా పనిచేసి అర్హులైన నిరుపేదలకే పథకాలు అందేలా చూడాలని సూచించారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో అవినీతి, అక్రమాలకు ఎలాంటి అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# దానం లెక్కేంటి..?

(మొదటిపేజీ తరువాయి)



కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం దానం రాజకీయ ప్రయాణంలో కీలక మలుపులు. ఇదే వ్యవహారం చివరకు న్యాయపోరాటానికి దారితీసింది. ఇప్పుడు అనర్హత వేటు పడటంతో 'పార్టీ మారిన ఎమ్మెల్యే' అనే రాజకీయ విమర్శను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఉపఎన్నిక జరిగితే ఈ అంశమే ప్రధాన ప్రచారాస్త్రంగా మారే అవకాశం ఉంది. దానం మాత్రం న్యాయపరమైన వివాదం కంటే ప్రజా తీర్పుకే ప్రాధాన్యం ఇవ్వాలన్న ధోరణిలో ఉన్నారు. తనపై ఉన్న రాజకీయ విమర్శలకు ఎన్నికల ద్వారా సమాధానం చెప్పాలన్నదే ఆయన వ్యూహంగా కనిపిస్తోంది. అయితే అనర్హత తర్వాత ఉపఎన్నికలో పోటీకి సంబంధించిన చట్టపరమైన అంశాలపై తుది స్పష్టత రావాల్సి ఉంది.

**గత ఓటమి.. ఆ తర్వాత పుంజుకున్న నేత**
దానం నాగేందర్ రాజకీయ జీవితంలో ఎదురుదెబ్బలు కొత్త కాదు. 2004లో టీడీపీ తరఫున ఆసిఫ్‌నగర్ నుంచి గెలిచిన ఆయన అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. ఆ తర్వాత జరిగిన ఆసిఫ్‌నగర్ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అయినప్పటికీ హైదరాబాద్ రాజకీయాల్లో తన పట్టును కోల్పోలేదు. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆయనకు గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించారు. 2009లో ఖైరతాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచిన దానం.. వైఎస్సార్ మంత్రివర్గంలో కార్మిక, ఆరోగ్య శాఖలను నిర్వహించారు. అంటే ఎన్నికల ఓటమి తర్వాత కూడా రాజకీయంగా తిరిగి పుంజుకున్న అనుభవం ఆయనకు ఉంది. అదే ధైర్యంతో తాజా పరిణామాన్ని కూడా మరో రాజకీయ అవకాశంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నారు.

**ఖైరతాబాద్ మళ్లీ దానం అడ్డా అవుతుందా?**
ఉపఎన్నిక జరిగితే దానం నాగేందర్‌కు అసలు పరీక్ష ఖైరతాబాద్‌లోనే. గతంలో తనకు అండగా నిలిచిన కేడర్‌ను మళ్లీ ఏకతాటిపైకి తీసుకురావడం, స్థానిక నాయకులతో సమన్వయం చేసుకోవడం, ప్రజల్లో తన రాజకీయ అవసరాన్ని వివరించడం ఆయన ముందున్న సవాళ్లు. ముఖ్యంగా పార్టీ మార్పు అంశాన్ని ప్రత్యర్థులు ప్రచారంలోకి తెస్తే దానికి సమర్థవంతమైన రాజకీయ సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానం దానం స్థానికంగా ఉన్న ప్రభావాన్ని, గత ఎన్నికల పనితీరును, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థిత్వంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. దానంకు టికెట్ ఇస్తే హైకోర్టు తీర్పు తర్వాత ఆయననే మరోసారి ప్రజల్లోకి పంపినట్లవుతుంది. కొత్త అభ్యర్థిని ఎంపిక చేస్తే మాత్రం నియోజకవర్గంలో కొత్త రాజకీయ సమీకరణాలను నిర్మించాల్సి ఉంటుంది.

## దానం చుట్టూ కాంగ్రెస్‌లో కొత్త లెక్కలు

**ఖైరతాబాద్ ఉపఎన్నిక జరిగితే కాంగ్రెస్‌కు మాత్రమే కాకుండా బీఆర్ఎస్, బీజేపీలకు కూడా అది కీలకంగా మారనుంది. మూడు పార్టీలూ తమ బలాబలాలను పరీక్షించుకునే అవకాశం ఉంటుంది. దానం నాగేందర్ విషయంలో మాత్రం లెక్క మరింత స్పష్టంగా ఉంది. ఎమ్మెల్యే పదవి పోయినా రాజకీయ ప్రస్థానం ఆగకూడదు.. పార్టీ బీఫామ్ దక్కితే మళ్లీ ఖైరతాబాద్ నుంచే ప్రజల్లోకి వెళ్లాలి అన్నదే ఆయన వ్యూహంగా కనిపిస్తోంది. అందుకే హైకోర్టు తీర్పు తర్వాత దానం నాగేందర్ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. న్యాయపోరాటం కంటే ఎన్నికల పోరునే ఎంచుకోవడం ద్వారా తన రాజకీయ భవిష్యత్తును మరోసారి ఓటర్ల ముందుంచేందుకు ఆయన సిద్ధమయ్యారు. ఇక అసలు మలుపు కాంగ్రెస్ బీఫామ్‌తోనే. దానం కోరుకున్నట్టుగా టికెట్ వస్తుందా? వస్తే మరోసారి ఖైరతాబాద్ గడ్డపై తన సత్తా చాటుతారా? అన్నది ఉపఎన్నిక షెడ్యూల్‌తో పాటు స్పష్టమయ్యే అంశంగా మారింది.**



# లారీ డ్రైవర్ అజాగ్రత్తతో వ్యక్తి మృతి

- **గూడెప్పాడు శివారులో జాతీయ రహదారిపై ప్రమాదం**
- **లారీ వెనుక ఢీకొని అక్కడికక్కడే మృతి**

**కాకతీయ, ఆత్మకూరు:** లారీ డ్రైవర్ అజాగ్రత్తతో శనివారం వ్యక్తి మృతి చెందిన ఘటన ఆత్మకూరు మండలం గూడెప్పాడు గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఆత్మకూరు సీఐ బాబులాల్ తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మసాగర్ గ్రామానికి చెందిన కనకం శరత్‌కుమార్ (28) పాల బండి నడుపుతూ పరకాలలో పాలు పోసి తిరిగి వస్తున్నాడు. గూడెప్పాడు శివారులో జాతీయ రహదారి 163పై లారీని డ్రైవర్ అజాగ్రత్తగా నిలిపివేయడంతో, లారీ కదులుతుందని భావించిన శరత్‌కుమార్ వెనుక నుంచి ఢీకొన్నాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు సీఐ తెలిపారు. ఈ ఘటనపై లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్మకూరు సీఐ బాబులాల్ పేర్కొన్నారు.

# రహమునిషా బేగంకు పరామర్శ



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి:** తెలంగాణ ఉద్యమ నాయకురాలు రహమునిషా బేగం అనారోగ్యంతో హనుమకొండలోని ఏకశిల (మ్యాక్స్‌కేర్) ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ శనివారం ఆసుపత్రికి వెళ్లి రహమునిషా బేగంను పరామర్శించారు. ఆమె ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. రహమునిషా బేగంకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ఆమె త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# కడియం.. రెడీగా ఉండు!



(మొదటిపేజీ తరువాయి)
వికెట్‌గా అభివర్ణిస్తూ, ఫిరాయింపుల అంశంలో న్యాయపోరాటం కొనసాగుతుందని చెప్పారు. బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన ఇతర ఎమ్మెల్యేల విషయంలోనూ న్యాయపరమైన పరిణామాలు తప్పవని వ్యాఖ్యానించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ నిర్ణయం, రాజీనామా, అనర్హత వంటి అంశాలు రాజ్యాంగ నిబంధనల ప్రకారమే పరిష్కారం కావాలని రాజయ్య అన్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి తిరిగి ప్రజల్లోకి వెళ్లాలని డిమాండ్ చేశారు. స్పీకర్ నిర్ణయాలను న్యాయస్థానాలు పరిశీలించే పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో రాజ్యాంగపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

**హైకోర్టు తీర్పుతో ఫిరాయింపులపై వేడి**
దానం నాగేందర్ కేసులో హైకోర్టు తీర్పుతో తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల అంశం మరోసారి ప్రధాన చర్చగా మారిందని రాజయ్య అన్నారు. బీఆర్ఎస్ నేతలు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై న్యాయపోరాటం కొనసాగిస్తామని చెబుతున్న నేపథ్యంలో ఈ తీర్పు ప్రాధాన్యం సంతరించుకుందని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ సహా వివిధ పార్టీలు ఫిరాయింపులపై తమ వైఖరులను వెల్లడిస్తున్న సమయంలో, పార్టీ మారిన ఎమ్మెల్యేల భవిష్యత్‌పై న్యాయస్థానాల నిర్ణయాలు కీలకంగా మారనున్నాయని అన్నారు. ఫిరాయింపుల వ్యవహారంలో హైకోర్టు తీర్పు తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్నప్పటికీ, చివరకు రాజ్యాంగ నిబంధనలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలను పాటించాల్సిందేనని రాజయ్య అన్నారు. స్పీకర్ రాజ్యాంగబద్ధమైన బాధ్యతతో వ్యవహరించాలని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపులపై గతంలో న్యాయస్థానాలు నిర్దేశించిన నిబంధనలను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

**కడియం.. న్యాయపోరాటానికి సిద్ధంగా ఉండు**
దానం నాగేందర్ విషయంలో వచ్చిన తీర్పు తరహాలోనే కడియం శ్రీహరి విషయంలోనూ పరిణామాలు ఎదురవుతాయని రాజయ్య హెచ్చరించారు. బీఆర్ఎస్ తరఫున గెలిపించిన ప్రజలకు సమాధానం చెప్పకుండా కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు తిరిగి ప్రజల తీర్పును కోరాల్సిందేనన్నారు. కడియం శ్రీహరి విషయంలోనూ న్యాయపరమైన పరిణామాలు ఎదురయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపులపై న్యాయస్థానాల తీర్పులు వెలువడుతున్న నేపథ్యంలో ప్రజల తీర్పుతో గెలిచిన పదవిని కొనసాగించే అర్హతపైనే ప్రధానంగా చర్చ జరగాల్సి ఉందన్నారు. రాజయ్య తన వ్యాఖ్యల్లో రఘువీర్ పేరును కూడా ప్రస్తావించారు. అయితే ఆయనకు సంబంధించిన అంశంపై స్పష్టమైన వివరాలు అందుబాటులో లేనందున, నిర్ధారణ లేని విషయాలను జోడించకుండా ఆ ప్రస్తావనకే పరిమితం కావాల్సి ఉంటుంది. మొత్తం మీద దానం నాగేందర్ కేసు తీర్పును ఆధారంగా చేసుకుని కడియం శ్రీహరిపై మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య చేసిన హెచ్చరిక రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఫిరాయింపులపై పెండింగ్‌లో ఉన్న కేసుల్లో తదుపరి న్యాయపరమైన పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

# వనమా ఇంట్లో వారసత్వ వార్!

(మొదటిపేజీ తరువాయి)
ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం. వనమా కుటుంబానికి నియోజకవర్గ రాజకీయాల్లో సుదీర్ఘ అనుబంధం ఉండటంతో తదుపరి రాజకీయ వారసుడెవరన్నది ప్రాధాన్యం సంతరించుకుంది.

**వంటావార్పు వేదికగా కీలక వ్యాఖ్యలు**
ఇటీవల బీఆర్ఎస్ నిర్వహించిన వంటావార్పు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు కుటుంబ రాజకీయాల్లో మరింత చర్చకు దారితీశాయి. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా వద్దిరాజు రవిచంద్రను గెలిపించుకోవాలని పార్టీ శ్రేణులకు వనమా వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ వ్యాఖ్యల తర్వాత తండ్రి వైఖరిపై రాఘవ అసంతృప్తికి గురైనట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. నియోజకవర్గ రాజకీయాల్లో తనకు ప్రాధాన్యం తగ్గే పరిస్థితులు ఏర్పడుతున్నాయనే భావన కూడా ఆయనలో ఉన్నట్లు సమాచారం. బీఆర్ఎస్ నుంచి రాఘవపై ఇప్పటికే సస్పెన్షన్ వేటు పడింది. అది తొలగకపోవడంతో తన రాజకీయ భవిష్యత్‌పై రాఘవ ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. సస్పెన్షన్ తొలగించేందుకు వద్దిరాజు రవిచంద్ర పలుమార్లు పార్టీ అగ్రనేతల వద్ద రాఘవ అంశాన్ని ప్రస్తావించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కేటీఆర్ వద్ద కూడా ఈ విషయాన్ని ప్రస్తావించి, రాఘవపై పార్టీ అగ్రనాయకత్వంలో ఉన్న వ్యతిరేకతను తగ్గించే ప్రయత్నాలు జరిగినట్లు సమాచారం. కార్పొరేషన్ ఎన్నికల సమయంలో పార్టీకి చెప్పి రాఘవ సేవలను వినియోగించుకున్నట్లు కూడా పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

**కుర్చీలు విరగ్గొట్టిన ఘటనతో ఆగ్రహం**
సస్పెన్షన్ తొలగే వరకు వేచి ఉండకుండా రాఘవ మళ్లీ తన పాత పంథాలోనే వ్యవహరిస్తున్నారన్న చర్చ బీఆర్ఎస్‌లో మొదలైంది. కేసీఆర్ దూత తక్కెళ్లపల్లి రవీందర్‌రావు సమక్షంలో రాఘవ అనుచరులు కుర్చీలు విరగ్గొట్టిన ఘటన పార్టీ పెద్దలకు ఆగ్రహం తెప్పించినట్లు సమాచారం. ఈ ఘటన తర్వాత రాఘవతో ఎలాంటి పార్టీ సేవలు వినియోగించవద్దని పార్టీ పెద్దలు ఆదేశించినట్లు బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అప్పటి నుంచి రాఘవలో అసంతృప్తి మరింత పెరిగినట్లు సమాచారం. నియోజకవర్గంపై తన రాజకీయ పెత్తనం పోతుందనే ఆందోళనతోనే రాఘవ పార్టీ లోపల కొత్త గందరగోళానికి తెరలేపుతున్నారన్న చర్చ బీఆర్ఎస్ శ్రేణుల్లో జరుగుతోంది. ఒకవైపు సస్పెన్షన్ కొనసాగుతుండటం, మరోవైపు పార్టీ నాయకత్వం ఇతర నాయకులకు ప్రాధాన్యం ఇస్తుండటం రాఘవకు ఇబ్బందికరంగా మారినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నిజంగా వనమా కుటుంబ వారసులను రాజకీయాల్లోకి తీసుకురావాలనుకుంటే పార్టీ అగ్రనేతలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని పార్టీ శ్రేణులు సూచిస్తున్నాయి.

**వద్దిరాజు ప్రయత్నాలకు బ్రేక్?**
వంటావార్పు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చేసిన వ్యాఖ్యల తర్వాత రాఘవ తండ్రిపైనే తిరగబడ్డారన్న ప్రచారం పార్టీ వర్గాల్లో ఉంది. ఇంట్లో పని వాళ్ల సమక్షంలో తండ్రిపై తీవ్ర పదజాలంతో మాట్లాడినట్లు సమాచారం. రాజకీయాల్లోనూ ఇదే దూకుడు వైఖరితో రాఘవ గతంలో నష్టపోయారని కొందరు సీనియర్ నాయకులు అభిప్రాయపడుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ ఘటనకు సంబంధించి కుటుంబం నుంచి గానీ, పార్టీ నుంచి గానీ అధికారిక ప్రకటన వెలువడలేదు. రాఘవ సస్పెన్షన్ తొలగించేందుకు వద్దిరాజు రవిచంద్ర చేసిన ప్రయత్నాలు పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పలుమార్లు పార్టీ అగ్రనేతల వద్ద ఈ అంశాన్ని ప్రస్తావించి రాఘవపై ఉన్న వ్యతిరేకతను తగ్గించే ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. కార్పొరేషన్ ఎన్నికల్లోనూ పార్టీకి చెప్పి రాఘవ సేవలను వినియోగించుకున్నట్లు చెబుతున్నారు. అయినప్పటికీ సస్పెన్షన్ తొలగకపోవడంతో రాఘవ అసంతృప్తి మరింత పెరిగినట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. రాఘవ అనుచరులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించి పార్టీ కార్యకర్తల్లో గందరగోళం సృష్టిస్తున్నారన్న అసంతృప్తి బీఆర్ఎస్ ఉద్యమకారులు, కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. మొదటి నుంచి పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న కార్యకర్తలను వ్యక్తిగత రాజకీయ ప్రచారంతో అయోమయానికి గురిచేయడం సరికాదని వారు అంటున్నారు. కుటుంబ వారసత్వంపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటే పార్టీ పెద్దలతో చర్చించి స్పష్టతకు రావాలని సూచిస్తున్నారు. వ్యక్తిగత వర్గాల ఏర్పాటు, సోషల్ మీడియా ప్రచారంతో పార్టీకి నష్టం కలగకుండా నాయకత్వం జోక్యం చేసుకోవాలని కోరుతున్నారు.

**ఎవరి వారసత్వం.. ఎటువైపు రాజకీయం?**
ప్రస్తుతం వనమా కుటుంబంలో ప్రధాన ప్రశ్న రాజకీయ వారసత్వం ఎవరికి దక్కుతుందన్నదే. అలేఖ్యను ముందుకు తీసుకురావాలన్న రాఘవ పట్టుదల ఒకవైపు, సాయినాథ్‌ను రాజకీయాల్లోకి తీసుకురావాలన్న మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఆలోచన మరోవైపు కొనసాగుతున్నాయి. దీనికి తోడు రాఘవ సస్పెన్షన్, దాన్ని తొలగించేందుకు జరిగిన ప్రయత్నాలు, వంటావార్పు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు చేసిన వ్యాఖ్యలు, అనంతరం చోటుచేసుకున్న పరిణామాలు వనమా కుటుంబ రాజకీయాలను మరింత ఆసక్తికరంగా మార్చాయి. ఈ విభేదాలకు పార్టీ నాయకత్వం ఎలా ముగింపు పలుకుతుందన్నదే ఇప్పుడు బీఆర్ఎస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.



డా. వనమా అలేఖ్య



వనమా సాయినాథ్



మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు



వనమా రాఘవ

# ఈ డాక్టర్లు మారరా..?!

- రాయపర్తి పీహెచ్‌సీలో ఉదయమూ కనిపించని డాక్టర్లు
- ఎమ్మెల్యే, కలెక్టర్ ఆదేశాలు పెడచెవిన పెడుతున్న వైద్యులు
- ఓపి వేళలోనూ జాడ లేని వైద్యులు..రోగుల ఎదురుచూపులు..
- ఈసారైనా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటారా?
- లేక మళ్లీ గాలికి వదిలేస్తారా?

**కాకతీయ, రాయపర్తి :** ఎమ్మెల్యే, కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు చేసినా రాయపర్తి పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది తీరులో మార్పు కనిపించడం లేదని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 24 గంటల ఆసుపత్రి సాయంత్రం 4 గంటలకే తాళాలు వేస్తున్నదనే అంశంపై గతంలో కథనం ప్రచురితమవడంతో స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద, డీఎంహెచ్‌వో రాజిరెడ్డి ఆసుపత్రిని తనిఖీ చేశారు. దీంతో పరిస్థితి మారుతుందని ప్రజలు భావించినా.. కొద్దిరోజులకే మళ్లీ పాత పరిస్థితి నెలకొందని ఆరోపిస్తున్నారు. ఉదయం 9 గంటలకే ఓపీ సేవలకు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు 10, 11 గంటలు దాటినా ఆసుపత్రికి రావడం లేదని రోగులు వాపోతున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన వారు గంటల తరబడి వైద్యుల కోసం ఎదురుచూస్తున్నారని, చివరకు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తనిఖీలు చేసినా.. చర్యలేవీ?**

ఎమ్మెల్యే, కలెక్టర్, డీఎంహెచ్‌వో హాజరు పట్టికలను పరిశీలించి సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినా క్షేత్రస్థాయిలో మార్పు లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తనిఖీలు కేవలం ఫొటోలు, ప్రకటనలకే పరిమితమవుతున్నాయని ప్రజలు అంటున్నారు.



విధులకు గైర్హాజరవుతున్న వారిపై చర్యలు లేకపోవడంతోనే నిర్లక్ష్యం కొనసాగుతోందని పేర్కొంటున్నారు.

**బాధితుడు మహమ్మద్ రెహమాన్**

శనివారం ఉదయం ఆసుపత్రికి వచ్చిన తనకు 10:45 గంటలైనా డాక్టర్ అందుబాటులోకి రాలేదని మహమ్మద్ రెహమాన్ తెలిపారు. అస్వస్థతతో ఆసుపత్రికి వచ్చినా వైద్యులు లేక గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, డీఎంహెచ్‌వో స్పందించి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



బాధితుడు మహమ్మద్ రహమాన్



## వినాయక నిమజ్జనానికి పటిష్ఠ విద్యుత్ ఏర్పాట్లు

**టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి**

**కాకతీయ, హన్మకొండ:** వినాయక నిమజ్జనం సందర్భంగా విద్యుత్ ప్రమాదాలకు తావులేకుండా పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశించారు. శనివారం కాజీపేటలోని బంధం చెరువు, హన్మకొండ సిద్ధేశ్వర గుండం నిమజ్జన ప్రాంతాలను పరిశీలించారు. నిమజ్జన కేంద్రాలు, ఊరేగింపు మార్గాలు, గణేష్ మండపాల వద్ద విద్యుత్ లైన్లు, స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్టే వైర్లు, సర్వీస్ వైర్లను తనిఖీ చేసి ప్రమాదకర ప్రాంతాల్లో చర్యలు తీసుకోవాలని సూచించారు. తాత్కాలిక విద్యుత్ సదుపాయాల్లో ఎర్తింగ్, రక్షణ పరికరాలు ఏర్పాటు చేయాలని, 24 గంటల ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు, అత్యవసర బృందాలు, వాహనాలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పోలీసు, మున్సిపల్, రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హన్మకొండ ఎస్ఈ బి. సామ్య నాయక్, డీఈ సాంబరెడ్డి, ఏడీఈలు శ్రీనివాస్‌రెడ్డి, ఎం. ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వద్దు.. పేపర్ కవర్లే ముద్దు

**ఆదర్శ్ హైస్కూల్‌లో మార్కెట్ డే**



**కాకతీయ,హన్మకొండ :** హన్మకొండ ఎక్సైజ్ కాలనీలోని ఆదర్శ్ హైస్కూల్‌లో శనివారం మార్కెట్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రైమరీ పాఠశాల విద్యార్థులను సమీపంలోని మార్కెట్‌కు తీసుకెళ్లి ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలు, పర్యావరణంపై దాని ప్రభావం గురించి అవగాహన కల్పించారు. రోజువారీ అవసరాల కోసం మార్కెట్‌కు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ కవర్లకు బదులుగా పేపర్ కవర్లు, ఇతర పునర్వినియోగ సంచులను ఉపయోగించాలని విద్యార్థులు ప్రజలకు సూచించారు. విద్యార్థులు చేతుల్లో పేపర్ కవర్లను ప్రదర్శిస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని నినాదాలు చేశారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి, నీరు, జంతువులు, మనుషులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వివరించారు. చిన్న వయసు నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. మార్కెట్‌లో వస్తువుల కొనుగోలు సమయంలో ప్లాస్టిక్ కవర్లను తిరస్కరించి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని ప్రజలను కోరారు. మార్కెట్ డే ద్వారా విద్యార్థులకు పుస్తక జ్ఞానంతోపాటు సామాజిక బాధ్యత, పర్యావరణ పరిరక్షణపై ప్రత్యక్ష అవగాహన కలిగిందని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీపాల్‌రెడ్డి, శివనాగేశ్వర్ రావు, నర్సింహరావు, ప్రిన్సిపాల్ ప్రసున్న, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్యం

- యువతకు ఎఫ్‌టీఏలతో కొత్త కెరీర్ అవకాశాలు
- ప్రపంచ మార్కెట్లలో భారత ప్రతిభకు పెరుగుతున్న గుర్తింపు
- బ్రిక్స్‌లో యువత భాగస్వామ్యం పెరగాలి
- 'నాగరిక్ దేవో భవ' స్ఫూర్తితో సేవ చేయాలి : ప్రధాని నరేంద్ర మోదీ

**న్యూఢిల్లీ :** 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చే లక్ష్య సాధనలో యువత పాత్ర అత్యంత కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వివిధ దేశాలతో భారత్ కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు) యువతకు కొత్త కెరీర్ అవకాశాలకు మార్గం సుగమం చేస్తున్నాయని తెలిపారు. శనివారం జరిగిన 20వ రోజ్‌గార్ మేళాలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యువతను ఉద్దేశించి మాట్లాడిన ప్రధాని.. 51 వేల మందికి పైగా నియామక పత్రాలు అందజేశారు. భారత్ ఇప్పటివరకు వివిధ దేశాలతో 40 స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుందని మోదీ తెలిపారు. వీటి ద్వారా భారత వ్యాపారులకు కొత్త భాగస్వామ్యాలు, మార్కెట్లు అందుబాటులోకి వస్తున్నాయని, యువతకు ఉద్యోగాలు, నైపుణ్యాల ఆధారంగా కొత్త అవకాశాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. ప్రపంచ దేశాల్లో భారత యువత నైపుణ్యాలు, ప్రతిభపై విశ్వాసం పెరుగుతోందన్నారు.

**సేవే దేశ సేవ**

బ్రిక్స్ సహకారం ప్రభుత్వాలకే పరిమితం కాకూడదని, పారిశ్రామికవేత్తలు, రైతులు, మహిళలు, యువత కూడా చురుకుగా భాగస్వాములు కావాలని మోదీ సూచించారు. యువత నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని, కొత్త సాంకేతికత, వ్యవస్థలను అర్థం చేసుకోవాలని అన్నారు. 'మిషన్ కర్మయోగి' ఈ దిశగా సహాయపడుతుందని తెలిపారు. ప్రభుత్వ సేవలో 'నాగరిక్ దేవో భవ' స్ఫూర్తితో పనిచేయాలని సూచించారు. పౌరులకు సేవ చేయడమంటే దేశానికి సేవ చేయడమేనని, ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం వారి అనుభవాల ద్వారా ఏర్పడుతుందని అన్నారు. 20వ రోజ్‌గార్ మేళాలో దేశవ్యాప్తంగా 45 ప్రాంతాల్లో 51 వేల మందికి పైగా నియామక పత్రాలు అందించారు. ఇప్పటివరకు వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, సంస్థల్లో సుమారు 12.75 లక్షల మంది యువతకు నియామక పత్రాలు అందినట్లు ప్రధాని కార్యాలయం వెల్లడించింది.

## మామునూరులో ప్రపంచస్థాయి విమానాశ్రయ

- ఎయిర్‌పోర్టుతో వరంగల్‌కు కొత్త గుర్తింపు
- రూ.295 కోట్లతో భూసేకరణ.. ఏఏఐకి భూమి అప్పగింత
- పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలకు కొత్త గేట్‌వే
- కీలక ప్రక్రియంతా పూర్తయినట్లే : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**కాకతీయ, తెలంగాణ బ్యూరో :** వరంగల్ మామునూరు విమానాశ్రయం కలను సాకారం చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అనుమతులు, భూసేకరణ, సాంకేతిక పరిశీలన దశలను అధిగమించి నిర్మాణ పనులు 3 ప్యాకేజీలుగా చేపట్టే స్థాయికి చేరుకున్నామని తెలిపారు. ఇప్పటికే 2 ప్యాకేజీలకు టెండర్ల ప్రక్రియ పూర్తయిందని పేర్కొన్నారు. మామునూరులో రానున్న విమానాశ్రయానికి ఏం పేరు పెట్టాలో సూచించాలని సీఎం కోరారు. ప్రపంచస్థాయి విమానాశ్రయంగా వరంగల్ అభివృద్ధి చెందబోతోందని అన్నారు. భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.295 కోట్లు కేటాయించడంతోపాటు అవసరమైన భూమిని సేకరించి ఏఏఐకి అప్పగించిందని తెలిపారు. బీఆర్ఎస్ పదేళ్లు అధికారంలో ఉన్నా వరంగల్ విమానాశ్రయ కలను సాకారం చేయలేకపోయిందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఆ పార్టీ నేతలు తమ కుటుంబ ప్రయోజనాలు, ఫామ్‌హౌస్‌లపైనే దృష్టి పెట్టారని అన్నారు. కాంగ్రెస్ ప్రజాపాలనలో ఇప్పుడు వరంగల్ ఎయిర్‌పోర్టు కల సాకారం అవుతోందని స్పష్టం చేశారు.

**అభివృద్ధికి కొత్త చిహ్నం**

మామునూరు విమానాశ్రయం కేవలం ప్రయాణ సౌకర్యం మాత్రమే కాదని, పరిశ్రమలు, పర్యాటకం, విద్య, ఉద్యోగాలు, పెట్టుబడులకు కొత్త గేట్‌వేగా నిలుస్తుందని సీఎం పేర్కొన్నారు. అనుసంధానమైన, అభివృద్ధి చెందుతున్న తెలంగాణకు ఇది కొత్త చిహ్నంగా మారుతుందని అన్నారు. ఇటీవల ఢిల్లీలో కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడిని కలిసి మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని కోరినట్లు తెలిపారు. ఆయన ఏఏఐ అధికారులతో సమీక్ష నిర్వహించారని చెప్పారు. పర్యావరణ అనుమతుల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని కోరినట్లు వెల్లడించారు.

## టీబీ రహిత జిల్లాగా వరంగల్‌ను తీర్చిదిద్దాలి

**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా వరంగల్ జిల్లాను టీబీ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ డా. సత్య శారద అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఆమె ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారులు తమ పరిధిలో కమిటీలను ఏర్పాటు చేసి టీబీ స్క్రీనింగ్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య శాఖతో సమన్వయం చేసుకుని గ్రామాల్లో నిక్షయ్ శిబిరాలు, స్క్రీనింగ్, అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎన్సీసీ కమాండర్లు తమ క్యాంపెయిన్లలో టీబీ నివారణ అంశాలను చేర్చి ప్రజల్లో చైతన్యం కల్పించాలని, రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి ప్రత్యేక అవగాహన కల్పించాలని తెలిపారు. టీబీ రోగులకు పోషక సహాయం అందేలా నిక్షయ్ పోషణ, నిక్షయ్ మిత్ర కార్యక్రమాలకు స్పాన్సర్లను ప్రోత్సహించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లా స్థాయి కమిటీ టీబీ నిర్మూలన కార్యక్రమాల అమలు, శాఖల సమన్వయం, స్క్రీనింగ్, చికిత్స, పోషక సహాయ కార్యక్రమాలను సమీక్షించాలని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వై.వి. గణేశ్, డీఎంహెచ్ఓ డా. బి. రాజారెడ్డి, నర్సంపేట మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డా. సంధ్యారాణి, జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. దామోదర బాయి, టీబీ ప్రోగ్రాం అధికారి డా. అరుణ్ జోషి, డీఆర్డీవో నాగపద్మజ, జెడ్పీ సీఈవో ఎన్. వసంత, ఎన్సీసీ కమాండర్ కెప్టెన్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

## 19 రకాల గోదావరి రుచులతో అన్నసమారాధన



**కాకతీయ, కూకట్‌పల్లి:** వినాయకచవితి సందర్భంగా హైదరాబాద్ కేపీహెచ్‌బీ ఆదిత్యనగర్ పార్కు వద్ద వుయ్యూరు జగదీష్ ఆధ్వర్యంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఏలూరు జిల్లా కామవరపుకోటకు చెందిన జగదీష్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా నిర్వహించే అన్నసమారాధనను ఈసారి 19 రకాల ఆంధ్రా గోదావరి రుచులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. నూజివీడుకు చెందిన ప్రముఖ వంటమేస్త్రీ పుల్లయ్య బృందం ఆధ్వర్యంలో వంటలు తయారు చేసి 1500 మందికి పైగా భక్తులకు బంతిభోజనం పెట్టారు. చాలా రోజుల తర్వాత 19 రకాల వంటకాలతో గోదావరి రుచుల్లో అన్నసమారాధన నిర్వహించడం ఆనందంగా ఉందని భక్తులు ప్రశంసించారు. అన్నవరం ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దండోరా సినిమా నిర్మాత బెన్నీతో పాటు పలువురు సినీ, సీరియల్ ఆర్టిస్టులు పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన లడ్డూ వేలంలో తొలి లడ్డూను నీలేష్ చోప్రా-లక్ష్మీస్పందన దంపతులు రూ.61 వేలకు, రెండో లడ్డూను మందలపు హనుమంతు రూ.47 వేలకు, మూడో లడ్డూను లోహిత్‌చారి రూ.20 వేలకు సొంతం చేసుకున్నారు.

## నాడు ఈటల.. నేడు కేసీఆర్!

(మొదటిపేజీ తరువాయి)



కక్షతోనే చర్యలు తీసుకున్నారని అప్పట్లో పేర్కొన్నారు.

**భూవివాదం నుంచి హుజూరాబాద్ దాకా**

మంత్రి పదవి కోల్పోయిన ఈటల రాజేందర్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి హుజూరాబాద్ ఉపఎన్నికలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. దీంతో భూముల వివాదం కాస్తా తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ఇప్పుడు కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై సర్వే మొదలవడంతో అప్పటి పరిణామాలను ప్రస్తుత ఎర్రవల్లి వ్యవహారంతో పోల్చుతూ రాజకీయ చర్చ సాగుతోంది. సెప్టెంబరు 16న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎర్రవల్లి ఫామ్‌హౌస్ పరిసరాల్లో దాదాపు 700 ఎకరాల భూములపై విచారణకు ఆదేశించినట్లు ప్రకటించారు. సర్వే నంబరు 325లో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఆయన పేర్కొన్నారు. ఫామ్‌హౌస్‌కు సంబంధించిన భూముల్లో ఎంత ప్రైవేటు భూమి, ఎంత ప్రభుత్వ భూమి ఉందో రికార్డుల ఆధారంగా తేల్చాలని అధికారులను ఆదేశించారు.

**388 ఎకరాలపై కొలతలు**

రేవంత్ ఆదేశాల అనంతరం రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు ఎర్రవల్లి పరిధిలో క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టారు. సర్వే నంబరు 325లోని 388 ఎకరాలకు డిజిటల్ పద్ధతిలో హద్దులు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఎర్రవల్లి, వెంకటాపూర్, వరదరాజ్‌పూర్ గ్రామాల పరిధిలో సర్వే కొనసాగింది. రెండో రోజు కూడా పోలీసు బందోబస్తు మధ్య అధికారులు కొలతలు చేపట్టారు. సర్వే నంబరు 325లోని భూములు తమ ఆధీనంలోనే ఉన్నాయని పలువురు రైతులు అధికారులకు తెలిపారు. దశాబ్దాలుగా తాము సాగు చేస్తున్న భూములపై ప్రభుత్వం తిరిగి స్వాధీనం చేసుకుంటుందేమోనని ఆందోళన వ్యక్తం చేశారు. కొందరు రైతులు తమ భూములు కేసీఆర్ ఫామ్‌హౌస్‌లో లేవని, సర్వే నంబరు 325 భూములు నిషేధిత జాబితాలో ఉన్నాయని పేర్కొన్నారు.

**అసలు లెక్క రికార్డులదే**

ఇప్పుడు రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణల కంటే రెవెన్యూ రికార్డులే కీలకంగా మారాయి. 388 ఎకరాల భూమి వాస్తవంగా ఏ కేటగిరీలో ఉంది? ఎవరి పేర్లపై రికార్డులు ఉన్నాయి? ప్రస్తుతం ఎవరి ఆధీనంలో ఉంది? కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిధిలో ఎంత భూమి ఉంది? అనే అంశాలపై అధికారులు రికార్డులు పరిశీలిస్తున్నారు. సర్వే, పాత రికార్డులు, క్షేత్రస్థాయి వివరాలు సమన్వయంతో తుది నివేదిక రూపొందించనున్నారు. నాడు ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఈటల రాజేందర్ భూముల వ్యవహారంపై యంత్రాంగాన్ని రంగంలోకి దించారు. నేడు ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి అదే తరహాలో మాజీ సీఎం కేసీఆర్ భూములపై అధికారిక సర్వేకు ఆదేశించారు. దీంతో తెలంగాణ రాజకీయాల్లో 'నాడు ఈటల.. నేడు కేసీఆర్' అనే చర్చ ఊపందుకుంది. అయితే రెండు వ్యవహారాల వాస్తవ పరిస్థితులు ఒకటేనని తేల్చడానికి అధికారిక రికార్డులు, విచారణ నివేదికలు అవసరం.

**రాజకీయ అస్త్రమా.. భూ రికార్డుల వేటా?**

ఎర్రవల్లి వ్యవహారంపై ప్రభుత్వం చేపట్టిన చర్యలను బీఆర్ఎస్ రాజకీయ కోణంలో ప్రశ్నిస్తోంది. మరోవైపు ప్రభుత్వం మాత్రం భూములపై వాస్తవాలను రికార్డుల ఆధారంగా తేలుస్తామని చెబుతోంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెండు కుటుంబాల ఆస్తులపై సిట్టింగ్ హైకోర్టు లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తితో న్యాయ విచారణకు సవాల్ చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. ప్రస్తుతం ఎర్రవల్లి సర్వే కొనసాగుతున్న దశలోనే ఉంది. సర్వే నంబరు 325లోని 388 ఎకరాల భూమిపై అధికారులు హద్దులు గుర్తించి రికార్డుల పరిశీలన చేపట్టారు. ఈ భూముల స్వరూపం, యాజమాన్యం, ప్రభుత్వ హక్కులు, క్షేత్రస్థాయి పరిస్థితులపై తుది నివేదిక వచ్చిన తర్వాతే తదుపరి చర్యలకు స్పష్టత రానుంది. దీంతో నాటి ఈటల ఎపిసోడ్ తరహాలో ఎర్రవల్లి వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మలుపు తిప్పుతుందన్నది కాకుండా, అధికారిక నివేదికలో ఏం తేలుతుందన్నదే ఇప్పుడు అసలు ప్రశ్నగా మారింది.

## విద్యుత్ సమస్యలపై సర్పంచుల తీవ్ర ఆగ్రహం

- వైద్య సేవలు, రవాణా సౌకర్యాలు కల్పించాలి
- చిగురుమామిడి మండల స్థాయి

**అభివృద్ధి సమీక్షలో ప్రజాప్రతినిధుల నిలదీత**

**కాకతీయ, చిగురుమామిడి :** గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నా అధికారులు స్పందించకపోతే సమీక్ష సమావేశాలు నిర్వహించడం ఎందుకని సర్పంచులు నిలదీశారు. మండల కేంద్రంలో నిర్వహించిన చిగురుమామిడి మండల స్థాయి అభివృద్ధి సమీక్ష సమావేశం ప్రజాప్రతినిధుల ఆవేదన, నిలదీతల మధ్య సాగింది. విద్యుత్ శాఖ తీరుపై సర్పంచులు మార్క రాజకుమార్‌గౌడ్, కాటం సంపత్‌రెడ్డి, జంగా శిరీషారెడ్డి, ఒంటెల కిషన్‌రెడ్డి, గునుకుల మధుసూదన్‌రెడ్డి, సాంబారి భారతమ్మ, సన్నీళ్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. వైద్యశాఖ తీరుపై ఉల్లంపల్లి సర్పంచ్ అలువాల శంకర్ నిలదీశారు. రేకొండ సర్పంచ్ అల్లెపు సంపత్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, భవనం శిథిలావస్థకు చేరిందని తెలిపారు. కొత్త భవనానికి నిధులు మంజూరు చేయడంతో పాటు గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అధికారులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికే సమీక్షలు నిర్వహిస్తున్నామని, ప్రజాప్రతినిధులు తెలిపిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ చత్రు నాయక్, ఎంపీడీవో రామ్మోహన్‌చారి, తహసీల్దార్ కనకయ్య, సింగిల్‌విండో చైర్మన్ చిట్టుమల్ల రవీందర్, సర్పంచులు అకవరం భవాని, చింతపూల నరేందర్, బోయిని రమేష్, పీచు సత్యనారాయణరెడ్డి, గోగూరి లక్ష్మి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## బోగస్ అడ్మిషన్లపై అధికారుల ఆరా

- బోగస్ అడ్మిషన్లతో ప్రభుత్వ నిధుల మళ్లింపు?
- స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై విజిలెన్స్ సోదాలు
- పలు ప్రాంతాల్లో ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో తనిఖీలు

**కాకతీయ, హైదరాబాద్ :** బోగస్ అడ్మిషన్ల ద్వారా ప్రభుత్వ నిధులు దుర్వినియోగమవుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో హైదరాబాద్‌లోని పలు ప్రైవేట్ విద్యాసంస్థల్లో శనివారం విజిలెన్స్ అధికారులు సోదాలు నిర్వహించారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పేరుతో ప్రభుత్వ నిధులను మళ్లిస్తున్నారన్న ఆరోపణలపై అధికారులు తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ఇబ్రహీంపట్నంతో పాటు ఇతర ప్రాంతాల్లోని ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీల్లో సోదాలు నిర్వహించినట్లు డెక్కన్ క్రానికల్ నివేదించింది. బోగస్ అడ్మిషన్లకు సంబంధించిన వ్యవహారాలు, ప్రభుత్వ నిధుల వినియోగంపై అధికారులు వివరాలు సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. సోదాలకు సంబంధించిన పూర్తి వివరాలు, అధికారులు గుర్తించిన అంశాలపై అధికారిక సమాచారం ఇంకా వెల్లడికావాల్సి ఉంది.

# విద్యార్థుల గర్జన దేశవ్యాప్తంగా వినిపించాలి

- పేపర్ లీకేజీలు, పరీక్షల జాప్యాలకు అడ్డుకట్ట వేయాలి
- విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలపై పోరాటం
- హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి

**కాకతీయ, హన్మకొండ :** విద్యార్థుల హక్కులు, ఉజ్వల భవిష్యత్తు కోసం నిశ్శబ్దంగా ఉండకుండా ఒక్కతాటిపైకి రావాలని హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి పిలుపునిచ్చారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ నేతృత్వంలో నిర్వహించిన ఛాత్రోం కీ గూంజ్-విద్యార్థుల గర్జన కార్యక్రమానికి మద్దతుగా శుక్రవారం హనుమకొండ డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పేపర్ లీకేజీలు, అధిక ఫీజులు, సకాలంలో జరగని పరీక్షలు, ఉద్యోగ నియామకాల్లో జాప్యంతో విద్యార్థులు, యువత ఇబ్బందులు పడుతున్నారని ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి అన్నారు. కోచింగ్ సెంటర్లు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు సరైన భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పరీక్షల ఒత్తిడి, పేపర్ లీకేజీలు లేని మెరుగైన విద్యా వ్యవస్థ కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, నిరుద్యోగ యువత సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించే లక్ష్యంతో రాహుల్‌గాంధీ ఈ వేదికను ఏర్పాటు చేశారని తెలిపారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు, పేద విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్య, సకాలంలో ఉద్యోగ నియామకాల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి, వరంగల్ డీసీసీ అధ్యక్షుడు అయ్యూబ్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ, మారంరెడ్డి కౌటిల్‌రెడ్డి, తౌటం ఝాన్సీరాణి రవీందర్, గోవిందు శ్వేత, వేణు చారి, అలువాల కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



## చందుర్తి, సనుగుల సింగిల్ విండోలకు నూతన పాలకవర్గాలు

- చైర్‌పర్సన్లుగా గసికంటి ప్రభాకర్, ఏగోళం శ్రీనివాస్
- 12 మంది సభ్యులతో చందుర్తి, సనుగుల పాలకవర్గాలు

**కాకతీయ, చందుర్తి:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ పరిధిలోని చందుర్తి, సనుగుల సింగిల్ విండో సహకార సంఘాలకు నూతన పాలకవర్గాలను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చందుర్తి చైర్‌పర్సన్‌గా గసికంటి ప్రభాకర్, సనుగుల చైర్‌పర్సన్‌గా ఏగోళం శ్రీనివాస్ నియమితులయ్యారు. చందుర్తి పాలకవర్గ సభ్యులుగా మెడికల తిరుపతి, పసుల కాంతవ్వ, మానుపాటి ఎల్లయ్య (పెద్ద), దొంగరి భూమయ్య, వట్టెముల కిష్టయ్య, మల్యాల నర్సయ్య, బొద్దు శంకర్, రామిడి మల్లయ్య, నలుమాసు మహేందర్, చిలుక త్రిభువన్, కాసరపు శ్రీనివాస్, లాండే సుజాత నియమితులయ్యారు. సనుగుల పాలకవర్గంలో తాల్రె మనోహర్, అజ్మీరా గణేష్, ఇందురి సాయి రెడ్డి, దర్ణ మల్లేశం, తాల్రె లక్ష్మి, బొంత సురేందర్‌రావు, సనుగుల గంగాధర్, మెంగాని భూమయ్య, గడ్డం అనిల్, ఉగిలే శ్రీనివాస్, నల్ల ఆనందరెడ్డి, బనాల లక్ష్మి ఉన్నారు. నూతన చైర్‌పర్సన్లు, సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు

**కాకతీయ, చందుర్తి:** రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి జాతీయ మాల మహానాడు ఆధ్వర్యంలో శనివారం పాలాభిషేకం నిర్వహించారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడాన్ని నాయకులు స్వాగతించారు. అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ధర్నాలు, రాస్తారోకోలకు స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకున్న పోలీస్ శాఖ, న్యాయవ్యవస్థ, న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆసినిపర్తి ఏసుకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రవణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు నీరటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**కాకతీయ, నెల్లికుదురు:** అంగన్వాడీ సేవలను గర్భిణీలు, బాలింతలు, పిల్లలు, కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బొల్లికొండ చైతన్య నాగరాజు సూచించారు. మునిగలవీడు గ్రామంలో శనివారం ఐసీడీఎస్ అంగన్వాడీ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. సూపర్‌వైజర్ సరిత మాట్లాడుతూ ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఫైబర్, విటమిన్లు ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. రక్తహీనత నివారణకు పాలు, గుడ్లు, బీట్‌రూట్, బెల్లం, నువ్వుల ఉండలు, పల్లీ పట్టీలు, మునగాకు వంటి ఐరన్ సమృద్ధిగా ఉండే ఆహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లయ్య, ఉపాధ్యాయులు గీత, సుధాకర్, యుగేందర్, అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## స్వచ్ఛతాహి సేవపై విద్యార్థులకు అవగాహన

**కాకతీయ, ఇనుగుర్తి:** ఇనుగుర్తి మండలం కోమటిపల్లి హైస్కూల్‌లో శనివారం స్వచ్ఛతాహి సేవపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ మద్దెల బిక్షపతిగౌడ్ మాట్లాడుతూ చెత్తను ఉత్పత్తి అయ్యే ప్రదేశంలోనే వేర్వేరుగా సేకరించాలని సూచించారు. ఆకుపచ్చ డస్ట్‌బిన్‌లో తడి చెత్త, నీలం డస్ట్‌బిన్‌లో పొడి వ్యర్థాలు, ఎరుపు డస్ట్‌బిన్‌లో వ్యక్తిగత పరిశుభ్రత వ్యర్థాలు, నలుపు డస్ట్‌బిన్‌లో గృహ విషపూరిత పదార్థాలు, కాలం చెల్లిన మందులు వేయాలన్నారు. చెత్తను ఇలా వేరు చేస్తే గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచి ఇస్లావత్ బాబు, పంచాయతీ కార్యదర్శి రమణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెన్షన్ దరఖాస్తులన్నింటినీ పరిశీలించాలి

**కాకతీయ, నర్సంపేట టౌన్:** అర్హులైన ప్రతి ఒక్కరికీ వెంటనే పెన్షన్ మంజూరు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఖానాపురం మండల డీఆర్‌డీఏ కార్యాలయంలో వరంగల్ జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నర్సంపేట నియోజకవర్గంలో పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న సుమారు 21 వేల మందికి ఎలాంటి షరతులు లేకుండా పెన్షన్లు మంజూరు చేయాలని కోరారు. కాంగ్రెస్ హామీ మేరకు ఆసరా పెన్షన్ రూ.4 వేలకు, దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అర్హులైన వృద్ధుల దరఖాస్తులను పరిశీలించి పెన్షన్లు అందించాలని, అర్హత ఉన్న వృద్ధ దంపతులిద్దరి దరఖాస్తులను స్వీకరించాలని కోరారు. పెన్షన్‌దారులకు బకాయిపడిన రూ.66 వేల మొత్తాన్ని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బత్తిని శ్రీనివాస్‌గౌడ్, వేములపల్లి ప్రకాశ్‌రావు, మహాలక్ష్మి వెంకట నరసయ్య, రామసహాయం ఉపేందర్‌రెడ్డి, దాసరి రమేష్, వల్లెపు శ్రీనివాస్, పులిగిల్ల యాదగిరి, బుస అశోక్, ఆబోతు అశోక్‌యాదవ్, బంధారపు శ్రీనివాస్‌గౌడ్, నోముల నరేష్, రాపాక సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాన్ని పెంచాలి

- విద్యాబోధన, మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ
- కలెక్టర్ సత్య శారద ఆదేశం

**కాకతీయ, నల్లబెల్లి:** విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మరింత పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. శనివారం నల్లబెల్లి మండలంలోని బొల్లోనిపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, శనిగరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించి గణితంలోని వివిధ అంశాలపై ప్రశ్నలు వేశారు. లెక్కలు చేసే సామర్థ్యంతో పాటు పాఠ్యాంశాలపై అవగాహన, అభ్యసనా ప్రగతిని స్వయంగా పరిశీలించారు. అనంతరం పాఠశాలల్లో విద్యాబోధన, మౌలిక వసతులు, పారిశుద్ధ్య నిర్వహణను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యా ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, నల్లబెల్లి తహసీల్దార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




# జమ్మికుంట మున్సిపాలిటీలో ఆడియో కలకలం

- కౌన్సిలర్ వర్సెస్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వివాదం
- డీజిల్ బకాయిలు.. జేసీబీ పనులపై ఆరా
- వైరల్ ఆడియోలో లక్షల రూపాయల వ్యవహారం ప్రస్తావన
- జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు




**కాకతీయ, జమ్మికుంట :** జమ్మికుంట మున్సిపాలిటీలో కౌన్సిలర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మధ్య నెలకొన్న వివాదం తాజాగా వైరల్ అవుతున్న ఫోన్ సంభాషణతో మరింత ముదిరింది. పాత మున్సిపల్ కార్యాలయంలోని శానిటరీ విభాగం గది వినియోగం, డీజిల్ నిర్వహణ, పెట్రోల్ బంకుల పాత బకాయిలు, జేసీబీ పనుల ఖర్చులపై ఇప్పటికే విభేదాలు ఉండగా.. తాజాగా బయటకు వచ్చిన ఆడియో చర్చనీయాంశంగా మారింది. శానిటరీ విభాగం గదికి నిబంధనలకు విరుద్ధంగా తాళం వేస్తున్నారని, ప్రజలు తమ సమస్యలను ప్రజాప్రతినిధులకు చెప్పేందుకు ఇబ్బందులు పడుతున్నారని కౌన్సిలర్లు చెబుతున్నారు. అయితే శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఈ ఆరోపణలను ఖండిస్తూ, ఉద్యోగ నిబంధనల ప్రకారమే విధులు నిర్వహిస్తున్నానని తెలిపారు. డీజిల్ టోకెన్లు, డబ్బులకు సంబంధించిన ఆరోపణల్లో వాస్తవం లేదని, ఆధారాలు ఉంటే నిరూపించాలని సవాల్ చేశారు.

**డీజిల్ బకాయిలు.. జేసీబీ లెక్కలు**

వైరల్ ఆడియోలో డీజిల్ బంకు, సుమారు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఉన్న పాత బకాయిలు, సుమారు రూ.7 లక్షల జేసీబీ పనుల ఫైల్ ప్రస్తావన ఉన్నట్లు తెలుస్తోంది. డీజిల్ బంకుల వ్యవహారాన్ని మున్సిపల్ కమిషనర్ చూస్తున్నారని శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెప్పినట్లు సంభాషణలో ఉంది. జేసీబీ పనులకు సంబంధించిన ఫైల్ కూడా కమిషనర్ వద్దే ఉందని పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో వాస్తవాలు తేలాలంటే మున్సిపల్ వాహనాల డీజిల్ బిల్లులు, లాగ్‌బుక్స్, జీపీఎస్ వివరాలు, జేసీబీ పనుల వోచర్లు, వర్క్ ఆర్డర్లు, పరిపాలనా అనుమతులను పరిశీలించాల్సి ఉంది. ఈ అంశాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని కౌన్సిలర్లు స్పష్టం చేయడంతో జమ్మికుంట మున్సిపాలిటీలో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

## భూభారతి రీసర్వేలో భాగస్వాములు కావాలి

- భూ వివరాలను పక్కాగా నమోదు చేసుకోవాలి
- తేడాలు, అభ్యంతరాలను వెంటనే అధికారుల దృష్టికి తేవాలి
- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద సూచన




**కాకతీయ, నల్లబెల్లి:** భూభారతి రీసర్వే ప్రక్రియలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. నల్లబెల్లి మండలం అర్షనపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాల్గొన్న ఆమె రీసర్వే ప్రక్రియపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. రీసర్వే ద్వారా భూ వివరాలను పక్కాగా నమోదు చేయడంతో పాటు భవిష్యత్‌లో భూ సంబంధిత సమస్యలను తగ్గించే అవకాశం ఉంటుందని తెలిపారు. భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవాలని, సర్వే సమయంలో అధికారులకు అవసరమైన సహకారం అందించాలని కోరారు. భూ వివరాల్లో తేడాలు, అభ్యంతరాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రీసర్వేను పారదర్శకంగా, సమర్థవంతంగా పూర్తి చేసేందుకు గ్రామస్థుల సహకారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి శ్రీనివాసులు, నల్లబెల్లి తహసీల్దార్ కృష్ణ, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి సర్వం సిద్ధం చేయండి

- ఆదివారం లోగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
- చెరువుల్లో పారిశుద్ధ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి
- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న



**కాకతీయ, వరంగల్ :** నగరంలో వినాయక నిమజ్జనాన్ని ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఆదివారం లోగా పూర్తి చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. శనివారం మడికొండ, బంధం, సిద్ధేశ్వర గుండం, ఉర్సుగుట్ట, బేస్తం, అగర్తల, కట్టమల్లన్న, చిన్నవడ్డేపల్లి, ముచ్చర్ల, హసన్‌పర్తి, భీమారం తదితర నిమజ్జన చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఐదవ రోజు నుంచే నిమజ్జనాలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువుల్లో గుర్రపుడెక్క, పూడికతీత పనులను వేగంగా పూర్తి చేసి, నిమజ్జన ప్రాంతాల్లో సిబ్బందిని ముందుగానే కేటాయించాలన్నారు. క్రేన్లకు అవసరమైన ఇంధనాన్ని సమకూర్చుకోవాలని, ఇంజనీరింగ్, ఆర్అండ్‌బీ, డీఆర్ఎఫ్, మైనింగ్, మత్స్య తదితర శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. తెప్పలు, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు, ఉత్సవ కమిటీలకు తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, వెలుతురు సదుపాయాల్లో లోటు లేకుండా చూడాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పరిశీలనలో ఎస్ఈ రాజ్‌కుమార్, ఆరోగ్యాధికారి డా. రాజేష్, ఈఈలు రవికుమార్, సంజయ్‌కుమార్, మహేందర్, సంతోష్‌బాబు, మాధవీలత, డీఈ రాజ్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీను, ఏఈ హరికుమార్, ఇన్‌స్పెక్టర్ భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు
- క్రేన్లు, గజ ఈతగాళ్లు, బోట్లు సిద్ధంగా ఉంచాలి
- నిమజ్జన పాయింట్ల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ దివాకర టీఎస్



**కాకతీయ, ఖమ్మం బ్యూరో :** గణేష్ నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం దంసలాపురం చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్లను పోలీస్ కమిషనర్ సునీల్‌దత్, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించారు. చెరువులో నీటిమట్టం దృష్ట్యా బారికేడింగ్, గజ ఈతగాళ్లు, క్రేన్లు, బోట్లు, రక్షణ పరికరాలను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు, రాత్రి నిమజ్జనాలకు లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్, పార్కింగ్, ప్రవేశ-నిష్క్రమణ మార్గాలను ముందుగానే సిద్ధం చేయాలని ఆదేశించారు. ఎత్తైన విగ్రహాల తరలింపునకు ప్రత్యేక రూట్, ట్రాఫిక్, పోలీసు బందోబస్తు, రవాణా ఏర్పాట్లు చేయాలని సూచించారు. విగ్రహాల తరలింపు సమయంలో విద్యుత్ షాక్ ప్రమాదాలు, షార్ట్‌సర్క్యూట్ జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి నిమజ్జన పాయింట్ వద్ద మెడికల్ క్యాంపులు, 108 వాహనం, పాము కాటు మందులు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. పారిశుద్ధ్య సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించాలని, క్రేన్లకు అదనపు డ్రైవర్లు, మెకానిక్‌లను అందుబాటులో ఉంచాలని తెలిపారు. నిమజ్జనం రోజున ఉదయం 6 గంటలకే క్రేన్లు సిద్ధంగా ఉండాలని, అడ్డుగా వచ్చే చెట్టు కొమ్మలను ముందుగానే తొలగించాలని సూచించారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, వైద్య, అగ్నిమాపక, నీటిపారుదల శాఖలు, ఉత్సవ కమిటీలు సమన్వయంతో పనిచేసి నిమజ్జనాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జీఐఎస్‌తో ప్రతి ఆస్తి లెక్క తేల్చండి

- సమగ్ర ప్రాపర్టీ సర్వేకు పకడ్బందీ కార్యాచరణ
- సర్వేను పారదర్శకంగా, శాస్త్రీయంగా నిర్వహించాలి
- బల్దియా కమిషనర్ టి. వెంకన్న ఆదేశం



**కాకతీయ, వరంగల్ ప్రతినిధి :** గ్రేటర్ వరంగల్ నగరంలోని ప్రతి ఆస్తిని జీఐఎస్ విధానంలో లెక్క తేల్చేందుకు పకడ్బందీ కార్యాచరణ రూపొందించాలని బల్దియా కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు. శనివారం కమిషనర్ క్యాంపు కార్యాలయంలో జీఐఎస్ టెక్నికల్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించి ఆస్తిపన్ను సర్వే విధివిధానాలు, సాంకేతిక అంశాలు, డేటా సేకరణ, భవిష్యత్ వినియోగంపై చర్చించారు. నగరంలోని ఆస్తులకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని శాస్త్రీయంగా నమోదు చేసేలా ప్రణాళిక రూపొందించాలని వెంకన్న సూచించారు. ఇందుకోసం ఎన్ఐటీకి చెందిన ఇద్దరు ప్రొఫెసర్లు, కుడా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్, సూపరింటెండెంట్ ఇంజినీర్, సిటీ ప్లానర్, డిప్యూటీ కమిషనర్‌లతో సాంకేతిక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కమిటీ సూచనలు, సాంకేతిక అవసరాలు, నగర భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని ఆర్ఎఫ్‌పీని సమగ్రంగా రూపొందించాలని ఆదేశించారు. సర్వే పారదర్శకంగా, శాస్త్రీయంగా, సమర్థవంతంగా జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న రాణి, ఐటీ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ ల్యాడ్స్ పనులు త్వరగా పూర్తి చేయాలి

- అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం ఉండొద్దు
- ప్రారంభం కావాల్సిన పనులను వేగంగా చేపట్టాలి
- హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి

**కాకతీయ, హన్మకొండ:** ఎంపీ ల్యాడ్స్ నిధులతో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఎంపీ స్థానిక ప్రాంత అభివృద్ధి పథకం పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ, మిషన్ భగీరథ, టీజీఐడీసీ శాఖల పరిధిలో కొనసాగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పురోగతిలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు ప్రారంభం కావాల్సిన పనులను వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. వారం రోజుల్లో పనుల పురోగతిపై మరోసారి సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. సమావేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి సత్యనారాయణరెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ దేవిక చౌహాన్, మిషన్ భగీరథ ఈఈ గాయత్రి, పంచాయతీరాజ్ ఈఈ రాజగోపాల్‌రావు, డీఈలు, ఏఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## గ్రామ అవసరాలే ప్రణాళికకు ప్రాతిపదిక

- 375 రకాల పనుల్లో ప్రాధాన్య పనుల గుర్తింపు
- ప్రజల భాగస్వామ్యంతో సమగ్ర అభివృద్ధి ప్రణాళిక
- ఆత్మకూర్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి



**కాకతీయ, ఆత్మకూర్ :** గ్రామంలోని వాస్తవ అవసరాలను క్షేత్రస్థాయిలో గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపొందించడమే వికసిత్ గ్రామపంచాయతీ ప్లాన్ లక్ష్యమని ఆత్మకూర్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పెద్దాపూర్ గ్రామపంచాయతీలో వీబీజీ-రామ్‌జీ ప్లాన్ తయారీ విధానంపై శనివారం రైతువేదికలో గ్రామసభ నిర్వహించి డెమో చేపట్టారు. గ్రామస్థుల భాగస్వామ్యంతో సోషల్ మ్యాప్, రిసోర్స్ మ్యాప్‌లను రూపొందించారు. రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, విద్యుత్, వ్యవసాయ వనరులు, ప్రభుత్వ భవనాలు తదితర మౌలిక వసతులను గుర్తించి లోటుపాట్లపై చర్చించారు. 375 రకాల పనుల్లో గ్రామ అవసరాలు, ప్రయోజనం, సమస్య తీవ్రత ఆధారంగా అత్యవసర పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. గ్రామ సర్పంచ్ ఎలకటి రవి మాట్లాడుతూ ప్రజల సమస్యలను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు వికసిత్ గ్రామపంచాయతీ ప్లాన్ ఉపయోగపడుతుందన్నారు. తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ, వ్యవసాయం, వీధిదీపాల అవసరాలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో రాజిరెడ్డి, ఈసీ రాము, జిల్లా ఫిషరీస్ అధికారి చలపతి, హార్టికల్చర్ అధికారి సునీల్, వ్యవసాయ అధికారి యాదగిరి, వెటర్నరీ డాక్టర్ వింధ్యారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, టీఏలు సుధాకర్, శ్రీధర్, సురేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు, వార్డు సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

Printed and published owned by kiran goud arelli be half of amulya publications & printers graphics. printed at hanamkonda and published at H No. 5-12-42, pvr residency, hanuman nagar, hanamkonda- 506009- EDITOR- ARELLI KIRAN GOUD - RNI NO. TG TEL/25/A1234 - contact - 7396604266